క్లుప్తంగా

వేడుకగా వీరబ్రహ్మేంద్ర స్వామి ప్రభోత్సవం



ప్రభోత్సవం నిర్వహిస్తున్న గ్రామస్తులు

కోడుమూరు రూరల్: గూడూరు మండలంలోని పెంచికలపాడు గ్రామంలో వెలసిన పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలను పురస్కరించుకుని బుధవారం సాయంత్రం ప్రభోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి అమ్మవార్లకు గ్రామస్తులు వైభవంగా కల్యాణం నిర్వహించడంతో పాటు, మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. అనంతరం సాయంత్రం స్వామి వారి ఉత్సవ విగ్రహాలను ప్రభపై అధిష్టింపజేసి పురవీధుల్లో ఊరేగించారు.

ఈ–శ్రమ్ కార్డులను సద్వినియోగం చేసుకోవాలి



కూలీలకు అవగాహన కల్పిస్తున్న అసిస్టెంట్ జిల్లా లేబర్ ఆఫీసర్ కేశన్న

కోడుమూరు రూరల్: ప్రభుత్వం అందజేస్తున్న ఈ–శ్రమ్ కార్డులను ఉపాధి కూలీలు సద్వినియోగం చేసుకోవాలని అసిస్టెంట్ జిల్లా లేబర్ ఆఫీసర్ కేశన్న సూచించారు. బుధవారం మండలంలోని వర్కూరు గ్రామంలో అసిస్టెంట్ జిల్లా లేబర్ ఆఫీసర్ కేశన్న, ఏపీఓ మోదీన్‌బాషా పర్యటించి ఉపాధి పథకం కింద పనులు చేస్తున్న 150 మంది కూలీల వివరాలను నమోదు చేసుకుని అక్కడికక్కడే ఈ–శ్రమ్ కార్డులను అందజేశారు. కేశన్న మాట్లాడుతూ కూలీలంతా ఈ–శ్రమ్ కార్డులను తీసుకోవాలని, ఈ కార్డుల ద్వారా కూలీలకు ఉచితంగా ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. మండలంలోని కూలీలందరికీ కార్డులను అందజేస్తామని, ఉపాధి మేటీల ద్వారా కూడా కూలీలు కార్డులను పొందవచ్చునని చెప్పారు.

కౌలు కార్డులను సద్వినియోగం చేసుకోండి

సి.బెళగల్: రైతులు కౌలు కార్డులను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి మల్లేష్ కుమార్ అన్నారు. బుధవారం స్థానిక రైతు సేవాకేంద్రం – 2 లో కౌలు కార్డులపై గ్రామ సభ నిర్వహించి మాట్లాడారు. భూములను కౌలు కార్డులున్న రైతులే ప్రభుత్వ పథకాలకు అర్హులు అవుతారని తెలిపారు. ఇన్‌చార్జ్ తహసీల్దార్ పురుషోత్తం మాట్లాడుతూ మండలంలో ఉన్న 10 రెవెన్యూ గ్రామాల్లో 850 కార్డులను జారీ చేయాలని సిబ్బందికి సూచించారు. ఏఈఓ హిమబిందు, వీఆర్వోలు గౌరి, వెంకటేష్, సాయి రమణ, వీఏఏ ఆసిఫ్, ఎంపీఈఓలు వెంకటేష్, సునంద, రైతులు ఉన్నారు.

విపత్తు సమయంలో అప్రమత్తంగా మెలగాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఆర్‌డీఓ సందీప్‌కుమార్

ఓర్వకల్లు: విపత్తు సమయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని ఆర్‌డీఓ సందీప్‌కుమార్ సూచించారు. యుద్ధం, సంక్షోభం సంభవించినప్పుడు పౌరులు ఎదుర్కోవాల్సిన తీరుపై బుధవారం మండలంలోని పూడిచెర్ల గ్రామంలో మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డీఓ మాట్లాడుతూ.. రక్షణ శాఖ, అగ్నిమాపక శాఖ వారు సూచించిన జాగ్రత్తలు పాటిస్తూ ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. దాదాపు 50 సంవత్సరాల తర్వాత దేశవ్యాప్తంగా ఆపరేషన్ అభ్యసన పేరిట మాక్ డ్రిల్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎయిర్‌పోర్టు సమీపంలోని గ్రామాల ప్రజలు ఈ అంశాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎయిర్ పోర్టు సీఐ నాగేశ్వరరావు, ఎస్ఐ సునీల్‌కుమార్, ఎస్‌డీఆర్ఎఫ్, ఫైర్ సిబ్బంది, తహసీల్దార్ విద్యాసాగర్, ఎయిర్ పోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నీటిని పొదుపుగా వాడుకోవాలి

కోడుమూరు రూరల్ : వేసవి దృష్ట్యా ప్రజలంతా నీటిని పొదుపుగా వాడుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రసాద్ సూచించారు. బుధవారం మండలంలోని బైన్‌దొడ్డి గ్రామాన్ని సందర్శించి మంచినీటి పథకాలను పరిశీలించారు. ఏఈ మాట్లాడుతూగ్రామాల్లో మంచి నీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని, ప్రజలు సహకరించాలని కోరారు. ఏదైనా నీటి సమస్యలు తలెత్తితే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

రివిట్‌మెంట్ పనులు జరిగేనా?

- ఆకాల వర్షాలతో పనులకు అడ్డంకులు
- రోజురోజుకు కుంగుతున్న కట్ట
- రివెట్‌మెంట్ పనులు చేయకపోతే నీటి నిల్వ సాధ్యం కాదంటున్న ఇంజినీర్లు
- పెండింగ్ పనులపై దృష్టి పెట్టని ప్రభుత్వం



గోరుకల్లు ఓటీ రెగ్యులేటర్ వద్ద కుంగిన కట్ట

పాణ్యం: రాయలసీమకు జీవనాడిగా ఉన్న గోరుకల్లు జలాశయం కట్ట కుంగిపోవడంతో ఈ ఏడాది నీటి నిల్వపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గత నెలలో గోరుకల్లు ఓటి రెగ్యులేటర్ వద్ద కట్ట కుంగిపోవడం ప్రారంభమైంది. రోజురోజుకు కట్ట (రివిట్‌మెంట్) రాతి పరుపునకు అమర్చిన రాళ్లు నీటిలోకి జారిపోతున్నాయి. జలాశయంలో నీరు తగ్గేకొద్ది రాళ్లు వాటంతటవే జారిపోతుండటంతో కట్ట మరింత కుంగడం మొదలైంది. దీనిపై ఇప్పటికే పలుమార్లు ఇంజినీర్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయితే ప్రభుత్వం బడ్జెట్ కేటాయించని కారణంగా తాత్కాలిక పనులు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. అయితే ఈ రివెట్‌మెంట్ పనులు కూడా ఎప్పుడు మొదలుపెడతారనే ప్రశ్నలు రైతులకు మొదలయ్యాయి. ఒకవైపు అడపాదడపా వర్షాలు కురుస్తుండడంతో పనులు ఎప్పుడు చేస్తారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

నీరు తగ్గితే పనులకు ఆస్కారం

గోరుకల్లు కట్ట కుంగిపోవడం ఇది మూడోసారి. 2023లో మొదటిసారిగా కుంగిపోయినప్పుడు అప్పటి ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా యుద్ధప్రాతిపదికన గ్రీన్‌కో సహాయంతో పనులు చేపట్టి నీటి నిల్వకు ఇబ్బంది లేకుండా చేశారు. తర్వాత 2024లో కట్ట మరోసారి కుంగడంతో అధికారులు అధికారులు పనులు చేయించారు. ప్రస్తుతం ఇదే ప్రదేశంలో కట్ట మూడోసారి కుంగిపోయింది. గతంలో ఎక్స్‌పర్ట్ కమిటీకి సిఫార్సు చేయడంతో అధికారులు, కమిటీ సభ్యులు కుంగిన కట్టను పరిశీలించి పలు సూచనలు చేశారు. వెంటనే కట్ట పునఃరుద్ధరణ పనులు చేయాలని సూచించారు. వారి ఆదేశాల మేరకు పనులు చేపట్టారు. ఈ ఏడాది కూడా జలాశయంలో నీరు నిల్వ ఉండడంతో ఎలాంటి పనులు చేసేందుకు వీలు పడడం లేదు. జలాశయంలో దాదాపుగా 5 టీఎంసీల వరకు నీరు నిల్వ ఉండగా నీరు తగ్గేకొద్దీ రాతిపరుపు జారిపోతూనే ఉంది. నీరు మరింత తగ్గితే తప్పా పనులు చేయలేని పరిస్థితి.

తాత్కాలిక పనులకే మొగ్గు

గోరుకల్లు జలాశయం పెండింగ్ పనులను గాలి కొదిలేశారు. 2016లో అసంపూర్తిగా ఉన్న గోరుకల్లులోకి అప్పటి సీఎం చంద్రబాబునాయుడు ప్రచార ఆర్భాటం కోసం జలాశయంలోకి పూర్తి స్థాయిలో నీరు వదిలారు. జలాశయంలో 5 టీఎంసీల నీరు నిల్వ ఉంచిన కారణంగా గ్రామంలో విపరీతంగా ఊటలు పడటంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. తమకు పునరావాసం కల్పించాలని అనేక ఉద్యమాలు చేశారు. అంతేగాక డ్యామ్ నుంచి అనేక లీకేజీలు పడటంతో ఎక్స్‌పర్ట్ కమిటీ లీకేజీలను ఆరికట్టేందుకు కోట్ల రూపాయలు వెచ్చించారు. జలాశయం పూర్తి చేసి ఉంటే ఈ సమస్య తలెత్తేదికాదని ప్రజలు, సీనియర్ ఇంజినీర్లు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. పెండింగ్ పనుల కోసం ప్రతిపాదనలు పంపగా వాటికి కార్యరూపం దాల్చలేదు. దీంతో ఇలాంటి సమస్యలు వస్తే తాత్కాలిక పనులకే చొరవ చూపి చేతులు దులుపుకుంటున్నారు. ఇకనైనా ప్రభుత్వం దృష్టి సారించి పెండింగ్ పనులు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

త్వరలోనే పనులు చేపడతాం



గోరుకల్లు కట్ట రివిట్‌మెంట్ జారిపోతున్న విషయం ఉన్నతాధికారులకు తెలియజేశాం. రోజురోజుకు నీరు తగ్గేకొద్ది రాళ్లు జారిపోతున్నాయి. మరింత నీరు తగ్గితే పనులు చేసేందుకు వీలుంటుంది. రూ. 2.50 కోట్లతో తాత్కాలిక పనులు చేసేందుకు సిద్ధంగా ఉన్నాం. త్వరలోనే పనులు చేసి నీటి నిల్వకు ఇబ్బంది లేకుండా చూస్తాం.

– ఈఈ శుభకుమార్

నీటి నిల్వపై ఆశలు



గోరుకల్లు జలాశయంలో ఉన్న నీరు

గత నెలలో కట్ట రివిట్‌మెంట్ జారిపోయిన విషయం గ్రహించిన అధికారులు మరమ్మతు పనులు చేయాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయితే ఇంకా పనులు ప్రారంభం కాకపోవడంతో అటు రైతులల్లో, ప్రజల్లో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనికి తోడు అడపాదడపా వర్షాలు కురుస్తున్న తరుణంలో పనులు ఎప్పుడు ప్రారంభిస్తారని, ఎప్పుడు పూర్తి చేస్తారనే ప్రశ్నలు తలెత్తున్నాయి. మే నెల పూర్తయితే వర్షాలు ప్రారంభమవుతాయని, అప్పుడు పనులు ఎలా చేస్తారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

- ఒకరికి గాయాలు..
- ప్యాలకుర్తి దేవరకు వచ్చి వెళ్తుండగా ఘటన..



మృతిచెందిన గొల్ల వీరేష్

కోడుమూరు రూరల్: ద్విచక్ర వాహనాలను కారు ఢీకొట్టిన ఘటనలో ఒకరు మృతి చెందగా, మరో వ్యక్తి గాయపడ్డాడు. కోడుమూరు నుంచి కర్నూలుకు వెళ్లే రోడ్డులో ప్యాలకుర్తి సమీపంలో బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాలు..ఆస్పరి మండలం పలుకూరుబండ గ్రామానికి చెందిన గొల్ల వీరేష్ (35) బుధవారం ప్యాలకుర్తిలో జరిగిన దేవరకు బంధువుల ఇంటికి వచ్చి తిరిగి స్వగ్రామం వెళ్లేందుకు బైక్‌పై బయలుదేరాడు. ఈ నేపథ్యంలో ప్యాలకుర్తి గ్రామం దాటిన కొద్ది సేపటికే కోడుమూరు వైపు నుంచి కర్నూలు వెళ్తున్న కారు వేగంగా వీరేష్ బైక్‌ను ఢీకొట్టడంతో పాటు, కర్నూలు నుంచి తెర్నేకల్‌కు వివాహ నిమిత్తం వెళ్తున్న భీమేష్ బైక్‌ను కూడా ఢీకొట్టింది. దీంతో వీరేష్ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందగా, కర్నూలుకు చెందిన భీమేష్‌కు రక్తగాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే కారులో ప్రయాణిస్తున్న వ్యక్తులు కారును ప్రమాదం జరిగిన చోటనే వదిలేసి పారిపోయారు. విషయం తెలుసుకున్న కోడుమూరు ఎస్ఐ ఎర్రిస్వామి ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య ఎల్లేశ్వరితో పాటు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు సంతానం. కుటుంబ పెద్ద దిక్కు మృతితో కుటుంబ సభ్యులు తీవ్ర శోకసంద్రంలో మునిగిపోయారు.

ప్యాలకుర్తిలో వైభవంగా దేవర

– బోనాల సమర్పణకు పోటెత్తిన భక్తులు



ప్యాలకుర్తిలో ప్రత్యేక అలంకరణలో మారెమ్మ, సవారమ్మ దేవతామూర్తులు



దేవతామూర్తులకు నైవేద్యం సమర్పించేందుకు బోనాలతో వెళుతున్న గ్రామస్తులు

కోడుమూరు రూరల్: మండలంలోని ప్యాలకుర్తి గ్రామంలో వెలసిన శ్రీ మారెమ్మ, సవారమ్మ దేవరను బుధవారం గ్రామస్తులు వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా గ్రామస్తులు శ్రీమారెమ్మ, శ్రీసవారమ్మకు మేళతాళాలతో బోనాలు ఊరేగింపుగా తీసుకెళ్లి నైవేద్యాలు సమర్పించారు. గ్రామంలోని లోగిళ్లు బంధుమిత్రులతో కిటకిటలాడాయి.

ప్రముఖుల పూజలు..

ఉత్సవాల్లో భాగంగా గ్రామ దేవతలకు పలువురు ప్రముఖులు గ్రామం చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డా.ఆదిమూలపు సతీష్,స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు.

కూలీల వివరాలు నమోదు చేయండి



మాట్లాడుతున్న అసిస్టెంట్ లేబర్ అధికారి మద్దిలేటి

సి.బెళగల్: మండలంలోని ఉపాధి హామీ పనులకు వచ్చే కూలీల వివరాలను ఈ -శ్రమ్ పోర్టల్ నమోదు చేయాలని జిల్లా అసిస్టెంట్ లేబర్ అధికారి మద్దిలేటి అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ ఏపీఓ రామన్న, టీఏలు, ఎఫ్ఏలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ రాణెమ్మతో కలిసి జిల్లా అసిస్టెంట్ లేబర్ అధికారి హాజరయ్యారు. వారు మాట్లాడుతూ బీమా పథకాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. అనంతరం పశువుల నీటి తొట్లు, గోలకులం షెడ్లు, ఇంకుడు గుంతలు, పండ్ల తోటల సాగుకు రైతుల గుర్తింపుపై సమీక్షించారు. వెలుగు ఏపీఎం రామేశ్వర్, ఈసీ రంగస్వామి ఉన్నారు.

బస్సొచ్చిందోచ్..



బస్సును ప్రారంభిస్తున్న దృశ్యం

కర్నూలు(రూరల్): మండలంలోని పూడూరు గ్రామానికి 15 ఏళ్ల తరువాత ఆర్టీసీ బస్సు సౌకర్యం బుధవారం నుంచి పునఃప్రారంభమైందని గ్రామస్తులు తెలిపారు. రోడ్డు సౌకర్యం సరిగా లేనందున 15ఏళ్ల కిత్రం బస్సు సర్వీసును ఆర్టీసీ అధికారులు నిలిపేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2024 జనవరిలో నాబర్డు నిధులతో 14కి.మీ. రోడ్డు నిర్మాణానికి రూ.11.85కోట్లు మంజూరు చేయగా రోడ్డు నిర్మాణం పూర్తయ్యింది. దీంతో ఆర్టీసీ అధికారులు పడిదెంపాడు మీదుగా పూడురు గ్రామానికి మళ్లీ బస్సు సర్వీసును కల్పించారు. దీంతో రెండు గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. బస్సు సౌకర్యం లేక ఇన్నేళ్లు తాము ఎన్నో ఇబ్బందులు పడ్డామని చెప్పారు.

కూలీలకు సౌకర్యాలు కల్పించాలి

కర్నూలు(రూరల్): ఉపాధి హామీ పథకం కింద జరిగే పని ప్రదేశాల్లో కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి.నారాయణ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని పంచలింగాల, ఈ. తాండ్రపాడు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించి కూలీలతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ కూలీలకు వేతనాలు సక్రమంగా అందడం లేదన్నారు. క్రమం తప్పకుండా వేతనాలు చెల్లిస్తే వారి కుటుంబ పోషణకు ఇబ్బందులుండవన్నారు. ఎండలు మండిపోతున్నందున కూలీలకు మజ్జిగ,ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేయాలన్నారు. ఈ.తాండ్రపాడు సర్పంచ్ బాలపీర, పంచలింగాల మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నాటుసారా విక్రేతల అరెస్టు

కర్నూలు: కర్నూలు ఎక్సైజ్ స్టేషన్ సీఐ చంద్రహాస్ ఆధ్వర్యంలో గుమ్మితం తండా, హుసేనాపురం గ్రామాల్లో దాడులు నిర్వహించి ముగ్గురు సారా విక్రేతలను అరెస్టు చేసి 45 లీటర్ల నాటుసారా సీజ్ చేశారు. నిందితులపై కేసు నమోదు చేసి జైలుకు పంపారు. ఎక్సైజ్ సీఐ చంద్రహాస్‌తో పాటు ఎస్ఐలు నవీన్‌బాబు, నాగరాజు, సిబ్బంది బృందాలుగా ఏర్పడి గుమ్మితంతాండా, హుసేనాపురం గ్రామాల్లో తనిఖీలు నిర్వహించారు. గుమ్మితం తాండాకు చెందిన బీమా నాయక్ వద్ద 18 లీటర్లు, మొదిరేచ లోక్ నాయక్ వద్ద 12 లీటర్లు, హుసేనాపురం గ్రామానికి చెందిన కురువ సుధాకర్ వద్ద 15 లీటర్ల నాటుసారా కలిపి మొత్తం 45 లీటర్లు స్వాధీనం చేసుకుని ముగ్గురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు.

కుట్టు మిషన్ శిక్షణలోనూ దోచుకోవడమేనా?



ఆర్డీఓ కార్యాలయ ఏఓకు వినతి పత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కర్నూలు(రూరల్): పేద మహిళలకు ఇచ్చే కుట్టు మిషన్ల ట్రైనింగ్‌లోనూ కూటమి నాయకులు దోచుకోవడానికి ప్రయత్నించడం దారుణమని కర్నూలు నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు స్వాములు అన్నారు. బుధవారం కర్నూలు ఆర్డీఓ కార్యాలయంలో ఆయన మాట్లడుతూ దాదాపు రూ.150 కోట్లు దోచుకోవడానికి ఈ కూటమి ప్రభుత్వం కుట్ర పన్నిందని ఆరోపించారు. అనంతరం కుట్రపై చర్యలు తీసుకోవాలని కార్యాలయ ఏఓ వేణుగోపాల్ రావుకుకు వినతి పత్రం అందజేశారు . కర్నూలు మహిళా ప్రెసిడెంట్ మంగమ్మ, సిటీ అంగన్‌వాడీల సంఘ అధ్యక్షురాలు రాధికమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీను,మధు పాల్గొన్నారు.



పిన్నాపురం వద్ద నిర్మించిన ట్యాంక్‌లో నీటిని నింపుతున్న దృశ్యం

గ్రీన్‌కో మరో ముందడుగు

పాణ్యం: మండల పరిధిలోని పిన్నాపురం గ్రామంలో నిర్మించిన గ్రీన్‌కో హైడల్ ప్రాజెక్టులో మరో ముందడుగు పడింది. దాదాపు రూ.18 వేల కోట్లతో నిర్మిస్తున్న ఈ ప్రాజెక్టు పనులు దాదాపుగా పూర్తి కావొచ్చాయి. అయితే హైడల్ ప్రాజెక్టుకు కావాల్సిన నీటిని గోరుకల్లు జలాశయం నుంచి తీసుకుంటున్నారు. ఈ నీటిని నిల్వ ఉంచేందుకు పిన్నాపురం గ్రామం వద్ద నిర్మిస్తున్న ట్యాంక్ పనులు దాదాపుగా పూర్తి చేశారు. ట్రయల్‌రన్‌గా గ్రీన్ కో అధికారులు ట్యాంక్‌లోకి నీటి పంపింగ్ విజయవంతంగా చేపట్టారు. ప్రస్తుతం ట్యాంక్‌లోకి మూడు మోటార్ల ద్వారా నీటిని పంపింగ్ చేస్తున్నారు. మొదటిసారి ట్యాంకులోకి నీటి నిల్వ చేరడంతో అటు గ్రీన్‌కో అధికారులు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో వెళ్లి పరిశీలించారు. ట్యాంక్‌ను పూర్తి చేసి ఇదే నీటిని కిందకు వదలడం వల్ల విద్యుత్ ఉత్పత్తి కానుంది. ఇందుకోసం ట్యాంక్ భారీ ఎత్తున నిర్మించారు. ఇటీవలే కేంద్ర మంత్రి ప్రహ్లాద్‌జోషి ఈ ప్రాజెక్టును పరిశీలించారు. ప్రస్తుతం పనులు చకచకా చేపడుతున్నారు.

సామాజిక న్యాయ విగ్రహావిష్కరణ



పాశం యాదగిరికి దామోదరం సంజీవయ్య పురస్కారాన్ని అందజేస్తున్న అతిథులు

కల్లూరు: దళిత జన బాంధవుడు, ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య దేశానికి చేసిన సేవలు ఎనలేనివని రాజ్యసభ మాజీ సభ్యుడు వి.హనుమంతురావు, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ అన్నారు. బుధవారం పెద్దపాడులో దామోదరం సంజీవయ్య చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ దామోదరం రాధాకృష్ణమూర్తి ఆధ్వర్యంలో సంజీవయ్య మ్యూజియం, సామాజిక న్యాయ విగ్రహావిష్కరణ పేరుతో దామోదరం సంజీవయ్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. మొట్టమొదటి దామోదరం సంజీవయ్య పురస్కారాన్ని ఉద్యమకారుడు, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరికి అందించారు. అతిథులు మాట్లాడుతూ.. సంజీవయ్య వ్యక్తిత్వం పరిపాలన, నిజాయితీ గురించి వివరించారు. దేశంలో మొట్టమొదట సామాజిక పెన్షన్లను తీసుకొచ్చారని కొనియాడారు. దామోదరం సంజీవయ్య మెమోరియల్ వార్డు కమిటీ చైర్మన్ రామశేషయ్య, బహుజన విద్యావంతుల వేదిక అధ్యక్షుడు జేవీ కృష్ణయ్య, భారత్ కిసాన్ యూనియన్ అధ్యక్షుడు సయ్యద్ ముర్షీద్ ఫిర్ ఖాద్రి, బహుజన నాయకులు మోజెస్, ట్రస్టు సభ్యులు ఈశ్వరయ్య, ఎన్.రంగస్వామి, పోతుల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చేతి వృత్తుల్లో నైపుణ్యం పెంచుకోవాలి



శిక్షణా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత

ఓర్వకల్లు: మహిళలు చేతి వృత్తులపై నైపుణ్యం పెంచుకోవాలని ఎమ్మెల్యే గౌరు చరిత సూచించారు. బుధవారం స్థానిక పొదుపు భవనంలో మహిళా సమైఖ్య గౌరవ సలహాదారురాలు విజయభారతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బ్యూటీషియన్ శిక్షణ కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పొదుపు సంఘాల ద్వారా మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా పయణిస్తున్నారని తెలిపారు. అదే స్ఫూర్తితో చేతి వృత్తులపై ఆసక్తి కనబరచడం ద్వారా మరింత ఆర్థిక చేయూత లభిస్తుందన్నారు. ఇందులో భాగంగా మొట్టమొదటి సారిగా మగ్గం వర్క్, బ్యూటీషియన్ కోర్సుపై శిక్షణ కార్యక్రమాలకు విజయభారతి శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు. మొదటి సారిగా 25 మందికి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. మహిళలు ఈ అంశాలపై ఎంతో శ్రద్ధ పాటించి, శిక్షణ పూర్తిచేయాలని సూచించారు. టీటీడీ పాలక మండలి చైర్మన్ మల్లెల రాజశేఖర్, తహసీల్దార్ విద్యాసాగర్, మండల నాయకులు గోవింద రెడ్డి, లక్ష్మీకాంతారెడ్డి, రాంభూపాల్‌రెడ్డి, పొదుపు మహిళలు పాల్గొన్నారు.

సత్తా చాటిన బి.తాండ్రపాడు వృషభాలు



రాతి దూలాన్ని లాగుతున్న వృషభాలు

కృష్ణగిరి: మండలంలోని అమకతాడు గ్రామంలో వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాల్లో భాగంగా బుధవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి పాలపళ్ల ఎద్దుల బండలాగుడు పోటీల్లో కర్నూలు జిల్లా బి.తాండ్రపాడు వృషభాలు విజేతగా నిలిచాయి. పోటీల్లో వివిధ ప్రాంతాల నుంచి 8 జతల వృషభాలు పాల్గొనగా బి.తాండ్రపాడు గ్రామానికి చెందిన ఆకేపోగు వరలక్ష్మి వృషభాలు ప్రథమ స్థానంలో నిలిచాయి. రెండో స్థానంలో పెద్ద కొట్టాలకు చెందిన బోరెడ్డి నారాయణరెడ్డి, మిడుతూరుకు చెందిన సాయివర్ధన్ వృషభాలు ఉమ్మడిగా, మూడో స్థానంలో పసుపుల గ్రామానికి చెందిన డి.కృష్ణ, రాయలచెర్వుకు చెందిన రామచంద్రారెడ్డి వృషభాలు ఉమ్మడిగా, నాల్గో స్థానంలో నంద్యాల జిల్లా, సంజామల మండలం, కానాల గ్రామానికి చెందిన గుండం చెన్నారెడ్డి వృషభాలు, ఐదో స్థానంలో డోన్ మండలం యాపదిన్నె గ్రామానికి చెందిన కట్టల అరవిందు, సంజామల మండలం , చిన్న కానాల గ్రామానికి చెందిన సుంకన్న వృషభాలు ఉమ్మడిగా గెలుపొందాయి. ఎద్దుల యజమానులకు దాతలు, ఆలయ కమిటీ సభ్యులు వరుసగా రూ. 30వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రూ. 5వేలు, రూ.3వేలు అందజేశారు.

నేడు న్యూ కేటగిరీ విభాగంలో పోటీలు..

గురువారం న్యూ కేటగిరి విభాగంలో బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వారికి వరుసగా రూ. 40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రూ. 5వేలను అందిస్తున్నట్లు తెలిపారు.

వైద్య సిబ్బందిపై వ్యాఖ్యలు సరికాదు



మద్దూరులో నిరసన వ్యక్తం చేస్తున్న వైద్య సిబ్బంది

పాణ్యం: గత కొన్నేళ్లుగా వైద్యరంగంలో పనిచేస్తున్న సీనియర్ అధికారులపై ఎంఎల్‌హెచ్‌పీ రాష్ట్ర నాయకులు చేసిన వ్యాఖ్యలు సరికాదని, తక్షణమే ఆ వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మద్దూర్ పీహెచ్‌సీ సిబ్బంది బుధవారం నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ అభిషేక్, ఎంపీహెచ్‌ఈఓ సుబ్బారెడి మాట్లాడుతూ.. ఎంఎల్‌హెచ్‌పీ రాష్ట్ర నాయకులు చేసిన వ్యాఖ్యలను తక్షణమే వెనక్కు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో ఉద్యమాలు ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. అనంతరం ఏఎన్ఎంలు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు.

గ్రంథాలయంలో అల్లూరికి నివాళి



అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

పాణ్యం: మండల కేంద్రంలోని గ్రంథాలయంలో బుధవారం అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు.ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయాల కార్యదర్శి కాటం ప్రకాష్, గ్రంథాలయ అధికారి భాగ్యలక్ష్మీ మాట్లాడుతూ.. దేశ స్వాతంత్య్రం కోసం అల్లూరి సీతారామరాజు చిన్న వయస్సులోనే ప్రాణత్యాగం చేశారని వివరించారు. ఆయన త్యాగాన్ని భరతావని ఎన్నటికీ మరువదన్నారు. అనంతరం గ్రంథాలయంలో సమ్మర్ ఒరియంటేషన్ కార్యక్రమం ప్రారంభించారు. అందరూ ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శివారెడ్డి, గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.

ఆర్‌యూ విద్యార్థిపై కేసు నమోదు

కర్నూలు కల్చరల్: రాయలసీమ యూనివర్సిటీ ఇంగ్లిష్ డిపార్ట్‌మెంట్ విద్యార్థి, విద్యార్థి సంఘం నాయకుడు బి.నాగరాజుపై తాలుకా పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. వర్సిటీలోని ఫోర్త్ బిల్డింగ్ సమీపంలో ఈనెల 1వ తేదీన నాగరాజు తనపై దాడి చేశాడని వర్సిటీ ఎలక్ట్రీషియన్ రమేష్‌యాదవ్ పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు. అయితే పోలీసులు కేసు నమోదు చేయలేదు. దీంతో బుధవారం పలువురు బీసీ, ప్రజా, మహిళా సంఘాల నాయకులు వర్సిటీకి వచ్చి రిజిస్ట్రార్ డాక్టర్ విజయకుమార్ నాయుడు, వీసీ ప్రొఫెసర్ వి.వెంకట బసవరావుతో వాగ్వివాదం చేశారు. పోలీస్‌లు కేసు నమోదు చేయకుండా వర్సిటీ అధికారులు అడ్డుకుంటున్నారని ఆరోపించడంతో తామెందుకు అడ్డుకుంటామని వారు బదులిచ్చారు. ఎట్టకేలకు బుధవారం సాయంత్రం తాలుకా పోలీసులు నాగరాజుపై కేసు నమోదు చేశారు.